# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 061
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
ఫిబ్రవరి 14, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## నిరుపేదలకు 'అమృత హస్తం'



- హెల్త్ కార్డ్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయిని
- రూ.15 వేలకే ఏడాదిపాటు నలుగురికి ఉచిత వైద్యం

4లో..



2లో..

## వెయ్యి స్తంభాల గుడిలో ఎమ్మెల్యే పూజలు



2లో..

## ఆధ్యాత్మికత ఉట్టిపడేలా మహాశివరాత్రి

శివతత్వాన్ని చాటి చెప్పడానికే ఈ ఉత్సవం

ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్ రెడ్డి

# శివాలయాల్లో.. 'మహా' ముస్తాబు




- రుద్రుడికి అత్యంత ప్రీతకరమైన రోజు మహా శివరాత్రి
- ఉపవాసం, జాగరణం ఈ పండుగ ప్రత్యేకత
- రేపు అంగరంగ వైభవంగా శివ-పార్వతుల కళ్యాణం
- రంగురంగుల విద్యుత్ దీపాల్లో ఆలయాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీలు

శివుడికి ఎంతో ప్రీతికరమైన రోజు మహా శివరాత్రి. హిందువుల పెద్ద పండుగల్లో శివరాత్రి ఒకటి. భక్తుల పాలిట పెన్నిధి, భోళా శంకరుడైన ఆ త్రినేత్రుడు లింగోద్భవం చెందిన పవిత్ర దినమే మహా శివరాత్రిగా కొలుస్తున్నారు. పార్వతీదేవిని శివుడు వివాహమాడిన రోజుగా కూడా దీనిని చెప్పుకుంటారు. శివయ్యకు భక్తులంటే ప్రీతి. భక్తులకు శివుడంటే నమ్మకం. అందుకే మహా శివరాత్రి పర్వదినాన హరహర మహాదేవ నామాన్ని జపిస్తూ జాగరణ చేస్తారు. అయితే మహా శివరాత్రి ఆదివారం రావడం ఎంతో శుభప్రదమంటున్నారు పండితులు. సూర్య సంబంధిత ఆదివారం మాఘ మాసంలో శివరాత్రి పర్వదినాన్ని నిర్వహించుకోవడం విశేషంగా భావిస్తున్నారు. సూర్యుడికి రుద్రుడు అధిదేవత అనీ, అలాంటి మాఘపు ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా సూర్యారాధన, శివారాధన కలిపి ఆచరించడంతో పాపాలు తొలగుతాయంటున్నారు. మనసా వాచా ఆ పరమ శివుడిని స్మరిస్తూ జాగరణ చేయడమే ఈ పండుగ పరమార్థం. మహా శివరాత్రి సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని శివాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యే క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తులకోసం చలువ పందిళ్లు వేశారు.

–వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు2లో..

### పబ్లిక్ గార్డెన్ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో..

హనుమకొండ పబ్లిక్ గార్డెన్ లోని శ్రీ దుర్గ సమేత రాజరాజేశ్వర స్వామి దేవలయంలో మహ శివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం 3 గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం 5 గంటల నుంచి భక్తులచే అభిషేకాలు నిర్వహించనున్నట్లు అర్చకులు అవధానుల సీతరామ శాస్త్రి, శ్రీ దుర్గ సమేత రాజరాజేశ్వర స్వామి ట్రస్ట్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు రాత్రి 8.05 నిముషాలకు శ్రీ శివ–పార్వతుల కళ్యాణం తదుపరి రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో బిల్వార్చన పుష్పార్చన అలంకరణ పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపా కటాక్షాలకు పాత్రులు కాగలరని వారు కోరారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ







# శివాలయాల్లో.. 'మహా'ముస్తాబు

- రుద్రుడికి అత్యంత ప్రీతకరమైన రోజు మహా శివరాత్రి
- ఉపవాసం, జాగరణం ఈ పండుగ ప్రత్యేకత
- రేపు అంగరంగ వైభవంగా శివ-పార్వతుల కళ్యాణం
- రంగురంగుల విద్యుత్ దీపాల్లో ఆలయాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీలు



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** హిందూ మతంలోని శైవ సంప్రదాయంలో మహా శివరాత్రికి ప్రత్యేక ప్రాముఖ్యం ఉంది. పగటిపూట జరుపుకునే చాలా హిందూ పండుగల మాదిరిగా కాకుండా, మహా శివరాత్రి రాత్రిపూట జరుపుకుంటారు. ఇంకా, సాంస్కృతిక ఆనందాన్ని వ్యక్తపరిచే చాలా హిందూ పండుగల మాదిరిగా కాకుండా, మహా శివరాత్రి అనేది ఆత్మపరిశీలన దృష్టి, ఉపవాసం, శివునిపై ధ్యానం, స్వీయ అధ్యయనం, సామాజిక సామరస్యం, శివాలయాలలో రాత్రంతా జాగరణ వంటి వాటికి ప్రసిద్ధి చెందిన గంభీరమైన కార్యక్రమం. శివుడు మన వెలుపల మాత్రమే కాదు, మనలో కూడా ఉన్నాడు. ఒకే ఆత్మతో మనల్ని మనం ఏకం చేసుకోవడం అంటే మనలోని శివుడిని గుర్తించడమే మహా శివరాత్రి ప్రత్యేకత.

### జాగరణతో పుణ్యఫలం..

శివపురాణంలో మహాశివరాత్రికి సంబంధించి ఇంకొన్ని కథలు కూడా ఉన్నాయి. మాఘమాసంలోని కృష్ణ పక్ష చతుర్దశి రోజున మహా శివరాత్రి వస్తుంది. ఈ రోజున శివుడిని భక్తి, పూజలతో కొలిస్తే అంతా మంచి జరుగుతుందని నమ్ముతారు. ఈ ఏడాది అలాంటి పవిత్రమైన రోజు ఫిబ్రవరి 15న వచ్చింది. దేశమంతటా శివాలయాల్లో పెద్ద ఎత్తున శివరాత్రి సంబరాలు జరుగుతుంటాయి. శివరాత్రి అనగానే అందరికీ వెంటనే గుర్తొచ్చేది ఉపవాసం, జాగరణ. ఈ రోజున ఉపవాసం ఉండి, రాత్రి జాగరణ చేస్తే పుణ్యం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. శివరాత్రి నాడు తెల్లవారుజామునే లేచి, స్నానం చేసి ఆ తర్వాత శివరాత్రి వ్రతాన్ని మొదలుపెట్టాలి. ఈ వ్రతం చేసేప్పుడు ఉపవాసం, జాగరణం, బ్రహ్మచర్యం అనే నియమాలు పాటించాలి. ఇంట్లో గానీ, ఆలయంలోగానీ వ్రతాన్ని ఆచరించవచ్చు. రాత్రంతా జాగరణం ఉండి, ఉదయాన్నే స్నానం చేశాక మళ్లీ పూజ చేసి వ్రతాన్ని విడవాలి. అన్నం లాంటి రోజూ తీసుకునే ప్రధాన ఆహారం కాకుండా పాలు, పండ్లు మాత్రమే ఆహారంగా తీసుకోవాలి. అదీ సాయంత్రం పూటనే ఆరగించాల్సి ఉంటుంది. ఇతరులతో దైవ సంబంధమైన మాటలు మాట్లాడితే మంచిది. ఓం నమః శివాయ మంత్రాన్ని జపిస్తూ ఉండాలి.

### ఉపవాస దీక్ష..

అనారోగ్యంతో ఉన్నప్పుడు ఉపవాసం ఉండకండి. మహా శివరాత్రి నాడు భక్తులు ఉపవాస దీక్షను పాటిస్తారు. చాలామంది కఠినంగా ఉండి.. కనీసం నీరు కూడా తాగరు. దీనిని నిర్జల ఉపవాసం అంటారు. కొంతమంది పాలు పండ్లు లాంటి సాత్విక ఆహారం తీసుకుంటారు. ప్రస్తుత జీవన ప్రమాణాల దృష్ట్యా పెరుగు, మజ్జిగ, కొబ్బరి నీరు, డ్రై ఫ్రూట్స్ వంటివి కూడా తినవచ్చు. శివరాత్రి మరుసటి రోజు సూర్యోదయం అయిన తరువాత ఉపవాస దీక్షను విరమించాలి. మహాశివరాత్రి ఉపవాస సమయంలో కొన్ని ఆహార పదార్థాలను ఖచ్చితంగా తినకూడదు. వీటిలో గోధుమలు, బియ్యం, పప్పులు, పప్పుధాన్యాలు వంటివి ఉన్నాయి. ఉల్లిపాయలు, వెల్లుల్లి, ఉడికిన పదార్థాలను తినకూడదు.

వీటితో పాటు మద్యం, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండాలని పండితులు చెబుతున్నారు. శివరాత్రికి చేసే జాగరణ మనలో ఉన్న శివత్వాన్ని జాగృతం చేస్తుంది. జాగరణం మనలో ఉన్న శివుడిని జాగృతం చేస్తుంది. సినిమాలు చూస్తునో, పిచ్చి కబుర్లు చెప్పుకుంటూనో, కాలక్షేపం చేస్తూనో చేసే జాగరణకు అది జాగరణ అవ్వదు. కాలక్షేపం మాత్రమే అవుతుంది. అప్పుడు పుణ్యం రాకపోగా, ఆ సమయంలో మట్లాడిన చెడు మాటల వలన పాపం వస్తుంది. శివరాత్రి మరునాడు ఉదయం శివాలయాన్ని సందర్శించి, ప్రసాదం తీసుకుని, ఇంటికి వచ్చి భోజనం చేసి ఉపవాస వ్రతం ముగించాలి. అందరూ గుర్తుపెట్టుకోవలసిన ముఖ్య విషయం, శివరాత్రి నాడు ఉపవాసం, జాగరణ చేసినవారు, తరువాత రోజు రాత్రి వరకు నిద్రించకూడదు. అప్పుడే సంపూర్ణఫలం దక్కుతుందని పండితులు వెల్లడించారు.



## ఘనంగా వటవృక్ష కళ్యాణం

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని హిందూ ముక్తిస్థల్ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు 21వ డివిజన్ ఎల్ బీ నగర్ పరిధిలోని హిందూ ముక్తిస్థల్ ఆవరణలో వటవృక్ష (శివ పార్వతుల) కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, అభిషేకాలు చేశారు. గత 18 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హిందూ ముస్తిస్థల్ సేవా సంఘం అధ్యక్షులు బూర రాంచందర్, కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి గోరంటల రాజు, కోశాధికారి ఉప్పుల రమేష్, కార్యనిర్వాహక సభ్యులు వంగరి భాస్కర్, శీలం బాబురావు, గోసికొండ సుధాకర్, గాదె ప్రభాకర్, ఇప్ప ఆదినారాయణ, మార్గం యెల్లయ్య, అంబటి అశోక్, గుములపురం ఉప్పలయ్య, జిల్లా యూత్ అధ్యక్షులు కురవి పరమేశ్వర్, ఆకెన వెంకటేశ్వర్లు, నలువాల మురళి, మధు, శ్రీను, తోట బాలరాజు, చిరంజీవి అయ్యగార్లు పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.



## ట్యాంక్ బండ్ పై మోడల్ రాకెట్

□ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్ డే సందర్భంగా ఇస్రో స్పేస్ ట్యూటర్, స్పేస్ రీసెర్స్ ల్యాబ్ నేతృత్వంలో వరంగల్ చరిత్రలోనే తొలిసారిగా, కాకతీయ వీరనారి గౌరవార్థం 'రుద్రమ వి.01' గా నామకరణం చేసిన మోడల్ రాకెట్ ను హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారు. యువతను ఖగోళం, అంతరిక్ష శాస్త్రాల వైపు ప్రోత్సహించడం, వారికి ఆస్ట్రానమీ గురించి నేర్పించడం, నక్షత్రాలను వీక్షించేలా ఫిబ్రవరి 18వ తేదీ నుంచి 27 వరకు భద్రకాళి ట్యాంక్ బండ్ లో ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి 11 గంటల వరకు టెలిస్కోపులతో నక్షత్ర, విహంగ వీక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంగా శనివారం బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేస్తున్న సందర్భంగా కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పరిశీలించారు.



## వెయ్యి స్తంభాల గుడిలో ఎమ్మెల్యే పూజలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహా శివరాత్రి వేడుకల సందర్భంగా వరంగల్ లోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీ రుద్రేశ్వర స్వామి (వెయ్యి స్తంభాల ఆలయం) లో శనివారం ఉదయం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్ శర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. అనంతరం లోకకల్యాణార్థం నిర్వహించిన పార్వతి పరమేశ్వరుల కళ్యాణం కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనం చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి నాయిని నీలిమ రెడ్డి, కుమార్తె డాక్టర్ గోదా విష్ణురెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికత ఉట్టిపడేలా మహాశివరాత్రి

### ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించే హయగ్రీవాచారి గ్రౌండ్స్ సభా ప్రాంగణాన్ని ఇండస్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, ప్రముఖ యోగ సాధకులు జిల్లా ప్రభు చైతన్య, హిందువాహిని ఉమ్మడి జిల్లా నేతలు శ్రీ రామ్ ఉదయ్, కార్పొరేటర్ రవి నాయక్, హిందువాహిని రాష్ట్ర సంపర్క ప్రముఖ్ సూర్య ప్రకాష్ రెడ్డి, సాయి, ఇండస్ ఫౌండేషన్ సభ్యులు శనివారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా ఓరుగల్లు ఆధ్యాత్మికత, శివతత్వం, కళలు, సంస్కృతి ఉట్టిపడేలా శివరాత్రి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు శివపార్వతుల కళ్యాణంతో కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఆయన ప్రకటించారు. పేరిణి శివతాండవం, లింగోద్భవ సమయంలో సప్తహారతీ, కూచిపూడి, భరత నాట్యం, వంటి సాంప్రదాయ నృత్యాలు, దేశభక్తి ప్రదర్శనలు ఉంటాయన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, ఇస్కాన్ స్వామీజీ రాధామనోహర్ దాస్ ప్రవచనం, పద్మశ్రీ కిన్నెర మొగిలయ్య కిన్నెర కళారూప ప్రదర్శన, ఆర్పీ పట్నాయక్, నల్గొండ గద్దర్, కాసర్ల శ్యామ్ స్వరాభిషేకం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. . ఇది మన ఓరుగల్లు ఉత్సవం కాబట్టి ప్రతీ ఇంటి నుంచి ఈ ఉత్సవానికి రావాలని రాకేష్ రెడ్డి పిలుపునిచ్చారు.



యోగా సాధకులు, జిల్లా ప్రభు చైతన్య మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో జెన్ జీ యువత వ్యసనాల వైపు మల్లుతున్న తరుణంలో ఆధ్యాత్మికత వైపు, సంస్కృతి, కళల వైపు ఇండస్ ఫౌండేషన్, ఏనుగుల రాకేష్ రెడ్డి మళ్లిస్తున్న తీరు ఎంతో గొప్పదన్నారు. వీహెచ్పీ నేత శ్రీ రామ్ ఉదయ్ మాట్లాడుతూ.. గత ఆరేళ్లుగా దిగ్విజయంగా నడుస్తున్న ఈ మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం కేవలం ఒక ఇండస్ ఫౌండేషన్ కార్యక్రమం లాగా కాకుండా ఒక కాకతీయుల ఉత్సవంగా, ఓరుగల్లు ప్రజల పండగగా, మినీ కుంభమేళాగా జరుగుతుందన్నారు. ఈ నెల 15 హనుమకొండ, హయగ్రీవాచారి గ్రౌండ్స్ లో ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కత్తుల అభిషేక్, ఇండస్ ఫౌండేషన్ కార్యదర్శి పురుషోత్తం యాదవ్, కార్యక్రమం కోఆర్డినేటర్ లు సుకాంత్, దీపక్, అఖిల్ రెడ్డి, వంశీ, చిర్ర సుమన్, శానబోయిన రాజ్ కుమార్, దేవయ్య, కొమురయ్య, రాజేందర్, కొదారి రవి, లక్ష్మణ్, భాస్కర్, నరేష్, తిలక్ రెడ్డి, రమేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో 'మిలాన్ గ్రూప్' సేవా పరిమళం

◆ ఉచితంగా సీసీటీవీ కెమెరాల ఏర్పాటు



**వరంగల్ వాయిస్, నడికూడ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల భద్రతే లక్ష్యంగా 'మిలాన్ గ్రూప్' చేపట్టిన సేవా కార్యక్రమం సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. హన్మకొండ జిల్లా నడికూడ మండలం ముస్త్యాలపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మిలాన్ గ్రూప్ ఆధ్వర్యంలో ఉచితంగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీటీవీ రంగంలో 15 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న మిలాన్ గ్రూప్ (అజ్జు భాయ్) ప్రతినిధులు సామాజిక బాధ్యతగా ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రతి నెలా ఒక ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేసి, అక్కడ ఉచితంగా కెమెరాలను అమర్చనున్నట్లు సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముస్త్యాలపల్లి పాఠశాలలో కెమెరాల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల రక్షణకు మిలాన్ గ్రూప్ అందిస్తున్న సహకారం అభినందనీయం. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రభుత్వ విద్యాలయాల భవిష్యత్తును మరింత మెరుగుపరుస్తాయని తెలిపారు. పాఠశాల ఆవరణలో నిరంతర నిఘా వల్ల విద్యార్థులకు రక్షణ పెరుగుతుంది. కెమెరాల ఏర్పాటుతో పాఠశాలలో క్రమశిక్షణ, బోధనా పద్ధతులను పర్యవేక్షించే అవకాశం ఉంటుంది.ప్రతి నెలా ఒక ప్రభుత్వ పాఠశాలకు ఉచిత సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్‌తో పాటు ప్రశాంత్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొని మిలాన్ గ్రూప్ ప్రతినిధి అజ్జు భాయ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మున్సిపల్ పరోక్ష ఎన్నికలకు గైడ్‌లైన్స్ విడుదల

◆ ఎక్స్-ఆఫిషియో సభ్యుల ఓటు హక్కుపై క్లారిటీ ఇచ్చిన ఎన్నికల కమిషన్

◆ హైకోర్టు తీర్పు మేరకు కొత్త నిబంధనలు అమలు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు రెండో సాధారణ ఎన్నికల ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో మేయర్, డిప్యూటీ మేయర్, చైర్‌పర్సన్, వైస్–చైర్‌పర్సన్ల పరోక్ష ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆధారంగా చేసుకుని ఎక్స్–ఆఫిషియో సభ్యుల అర్హతలపై స్పష్టతనిచ్చింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం కేవలం ఈ క్రింది వారికి మాత్రమే పరోక్ష ఎన్నికల్లో పాల్గొనే లేదా ఓటు వేసే హక్కు ఉంటుంది. సదరు మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్ పరిధిని పూర్తిగా గానీ, కొంత భాగంగా గానీ కలిగి ఉన్న నియోజకవర్గ ప్రతినిధులకు ఓటు హక్కు ఉంటుంది. వీరు ఎక్స్–ఆఫిషియో సభ్యులుగా ఓటు వేయాలంటే, సంబంధిత మున్సిపాలిటీ పరిధిలో ఖచ్చితంగా ఓటరుగా నమోదై ఉండాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243–S(5) ప్రకారం ఏర్పాటైన కమిటీల చైర్‌పర్సన్లు కూడా ఆ మున్సిపాలిటీలో ఓటరుగా ఉంటేనే ఓటు హక్కు పొందుతారు. మున్సిపల్ పరిపాలనలో ప్రత్యేక పరిజ్ఞానం లేదా అనుభవం ఉన్న వ్యక్తులను (Co–opted Members) సభ్యులుగా తీసుకోవచ్చు కానీ, వారికి పరోక్ష ఎన్నికల్లో ఓటు వేసే అధికారం ఉండదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243–ZA, 243–K, తెలంగాణ మున్సిపాలిటీల చట్టం–2019 లోని సెక్షన్ 194, 195(5) ప్రకారం ఈ నిబంధనలు రూపొందించారు. 2021లో రిట్ పిటిషన్ నెం.20262లో హైకోర్టు ఇచ్చిన తీర్పును ఖచ్చితంగా అమలు చేయాలని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. ఈ నిబంధనల వల్ల పరోక్ష ఎన్నికల్లో ఎలాంటి గందరగోళానికి తావుండదని కమిషన్ భావిస్తోంది.

# యాదాద్రీశుని సన్నిధిలో ఎమ్మెల్యే జీఎస్ఆర్

స్వామివారికి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, యాదాద్రి భువనగిరి :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) శనివారం ఉదయం దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల సందడి నెలకొన్న వేళ స్వామివారిని దర్శించుకున్న ఆయన, ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదాశీర్వచన మండపంలో అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. "యాదాద్రీశుని కృపతో రాష్ట్రంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలి. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సుఖసంతోషాల కోసం స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నాను" అని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 150 ఏళ్ల దేశభక్తికి ప్రేరణ 'వందేమాతరం'

◆ ఓరుగల్లు వ్యాప్తంగా ఘనంగా వందేమాతరం జయంతోత్సవాలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత స్వాతంత్ర సంగ్రామంలో కోట్లాది మందిలో దేశభక్తిని రగిలించిన 'వందేమాతరం' గీతం 150వ జయంతోత్సవాలను భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) ఓరుగల్లు శాఖ ఘనంగా నిర్వహిస్తోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం వరంగల్ కరీమాబాదులోని న్యూ కౌటిల్యాస్ సెయింట్ ఆమెన్ హై స్కూల్ విద్యార్థులకు ప్రత్యేక క్యాలెండర్లను పంపిణీ చేశారు. స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలు, వందేమాతరం పూర్తి పాఠంతో కూడిన లామినేటెడ్, మల్టీకలర్ క్యాలెండర్లను ఈ సందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి బీవీపీ కార్యదర్శి కే.సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 150 ఏళ్లుగా వందేమాతరం గీతం దేశభక్తికి తిరుగులేని ప్రేరణగా నిలుస్తోందని కొనియాడారు. విద్యార్థి దశ నుంచే దేశం పట్ల గౌరవాన్ని, భక్తిని పెంపొందించేందుకు భారత్ వికాస్ పరిషత్ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోడం సబిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కోడం శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యార్థులు వందేమాతరం స్ఫూర్తితో క్రమశిక్షణను అలవర్చుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అనంతరం వరంగల్ నగరంలోని సాహితీ హై స్కూల్, కివి హై స్కూల్, ఇండియన్ కిడ్స్ హై స్కూల్, సరస్వతి హై స్కూళ్లలో ఈ క్యాలెండర్ల పంపిణీ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమాల్లో బీవీపీ ఉపాధ్యక్షుడు గోవిందరాజులు, బిల్లా రవి (సాహితీ స్కూల్), సతీష్ (కివి స్కూల్), జ్ఞానేశ్వర్ సింగ్ (ఇండియన్ కిడ్స్), యుగంధర్ రాజు (సరస్వతి స్కూల్) లతో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు 'జయశంకర్ ఫౌండేషన్' భరోసా

నిరుపేద కుటుంబానికి నిత్యావసరాలు పంపిణీ



**వరంగల్ వాయిస్, గణపురం :** అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి రోడ్డున పడ్డ నిరుపేద కుటుంబానికి ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. గణపురం మండలం నగరంపల్లి గ్రామానికి చెందిన అజ్మీర జగ్గులు అనే వ్యక్తికి చెందిన గుడిసె ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి శనివారం బాధితుని ఇంటిని సందర్శించి, ఆ కుటుంబాన్ని పరామర్శించారు. నిరుపేద స్థితిలో ఉన్న జగ్గులు కుటుంబాన్ని పరామర్శించిన మారుతి, వారికి మనోధైర్యం కల్పించారు. ఫౌండేషన్ తరపున తక్షణ సహాయంగా 25 కిలోల బియ్యం బస్తా, నిత్యవసర సరుకులు, బట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకోవడమే ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని, జగ్గులు కుటుంబానికి భవిష్యత్తులో కూడా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఎండీ మహబూబ్, తన్మికొండ నాగరాజు పాల్గొన్నారు. తమను వెతుక్కుంటూ వచ్చి సహాయం అందించిన అయిలి మారుతికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

# పుల్వామా అమరవీరులకు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, నడికూడ :** దేశ రక్షణ కోసం పుల్వామా దాడిలో ప్రాణాలర్పించిన అమర జవాన్ల త్యాగాలు చిరస్మరణీయమని నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ పేర్కొన్నారు. శనివారం పుల్వామా దాడి వార్షికోత్సవం సందర్భంగా పాఠశాలలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొని జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ మాట్లాడుతూ.. 2019లో జరిగిన పుల్వామా ఆత్మాహుతి ఉగ్రదాడిలో సుమారు 40 మంది సైనికులు వీరమరణం పొందారని గుర్తుచేశారు. "భారత జవాన్ల మరణం వృథా పోదు, వారి త్యాగాన్ని ఈ దేశం ఎన్నటికీ మరువదు. విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలి. మనమంతా ప్రశాంతంగా ఉన్నామంటే దానికి కారణం సరిహద్దుల్లో కాపలా కాస్తున్న సైనికులే" అని ఆయన భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ నివాళులర్పించిన వారిలో పాఠశాల ఉపాధ్యాయులు కంచ రాజు కుమార్, పుల్లూరి రామకృష్ణ, అంగన్వాడీ టీచర్ నందిపాటి సంధ్య, పాఠశాల ఆయాలు, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణ అంతా 'భారత్ మాతా కీ జై', 'అమర జవాన్ల త్యాగం అమరం' అనే నినాదాలతో మారుమ్రోగింది.

# బొల్లె భిక్షపతి పార్థివదేహానికి నివాళి

**వరంగల్ వాయిస్, నడికూడ :** పరకాల మాజీ జడ్పీటీసీ, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు బొల్లె భిక్షపతి గురువారం రాత్రి కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు శనివారం ఆయన స్వగ్రామమైన పులిగిల్లకు చేరుకుని భిక్షపతి పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దురిశెట్టి చంద్రమౌళి భిక్షపతి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. నియోజకవర్గంలో రైతు నాయకుడిగా, ప్రజా ప్రతినిధిగా భిక్షపతి అందించిన సేవలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో నాయకులు మిన్నపురం సంతోష్, రాచర్ల కిరణ్, బీఆర్ఎస్ నడికూడ మండల ప్రధాన కార్యదర్శి నందికొండ గణపతి రెడ్డి, మాజీ సర్పంచ్ పాలకుర్తి సదానందం, గ్రామ కమిటీ అధ్యక్షులు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు 'అమృత హస్తం'

◆ హెల్త్ కార్డు ఆవిష్కరించిన నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పేద, మధ్యతరగతి వర్గాలకు మెరుగైన వైద్యాన్ని చేరువ చేసేందుకు హనుమకొండ కాకాజీ కాలనీలోని అమృత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సరికొత్త పథకాన్ని ప్రారంభించింది. శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాస్పిటల్ ప్రతినిధులతో కలిసి 'అమృత హస్తం' హెల్త్ కార్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, సామాన్యులకు కార్పొరేట్ వైద్యం భారం కాకూడదనే లక్ష్యంతో ఈ కార్డును రూపొందించడం అభినందనీయమన్నారు. కేవలం రూ.15,000 లకే ఏడాది పాటు ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సభ్యులకు ఉచిత ట్రీట్మెంట్




అందించనున్నారు. 10 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వయసు గల వారు ఈ కార్డు పొందేందుకు అర్హులు కాగా, సుమారు రూ.15 లక్షల విలువ చేసే వైద్యాన్ని ఈ కార్డు ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు. పేద వారు ఆకస్మిక ఆరోగ్య సమస్యల బారిన పడినప్పుడు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఈ 'అమృత హస్తం' కార్డు రక్షణగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ద శంకరయ్య మాట్లాడుతూ.. సమాజ సేవలో భాగంగానే ఈ వినూత్న హెల్త్ కార్డును ప్రవేశపెట్టామని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 'వరంగల్ వాయిస్' ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, అమృత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండి. బుద్ద శంకరయ్య,జన్ను సదయ్య, చిట్టి జానకి రామ్ రెడ్డి, చిట్టి సతీష్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## గొట్టిముక్కల మల్లికాంబకు శ్రద్ధాంజలి



**వరంగల్ వాయిస్,కాశీబుగ్గ :** వరంగల్ కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన దివంగత గొట్టిముక్కల మల్లికాంబ ఏకాదశ దినకర్మ శనివారం హనుమకొండలోని కేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు హాజరై మల్లికాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మల్లికాంబ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన వారిలో కారం రవీందర్ రెడ్డి, మార్గం కుమారస్వామి, కుసుమ సత్యనారాయణ, నాయిని జగన్మోహన్ రెడ్డి, కే.నరసింహారెడ్డి, కొండబత్తుల రాజమౌళి, గడ్డం కేశవమూర్తి, గొట్టిముక్కుల నాగసాగర్, బూర తిరుపతయ్య, గొట్టిముక్కల సదానందం తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మల్లికాంబ కుమారులు గొట్టిముక్కల సదానందం, రమేష్, శ్రీనివాస్, కుమార్తెలు అరుణ, కవిత, కనుకుంట్ల రమాదేవి, గోనె శారదలను బంధుమిత్రులు, ప్రముఖులు పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. పెద్ద సంఖ్యలో హాజరైన బంధుగణం మల్లికాంబతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

## రోహిణి ఆసుపత్రి సిబ్బంది రమేష్ మృతి

### డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి నివాళి



**వరంగల్ వాయిస్, పరకాల :** హనుమకొండ రోహిణి ఆసుపత్రిలో ఓటీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పోరండ్ల రమేష్ అకాల మరణం ఆసుపత్రి వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. పరకాల నియోజకవర్గ పరిధిలోని తారాలపెల్లి గ్రామానికి చెందిన రమేష్, వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసి శనివారం ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు. రమేష్ మృతి వార్త తెలిసిన వెంటనే రోహిణి ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పెసరు విజయ్ చందర్ రెడ్డి ఆసుపత్రి సిబ్బందితో కలిసి రమేష్ భౌతిక కాయాన్ని సందర్శించారు. ఆయన పార్థివ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి మాట్లాడుతూ.. రమేష్ క్రమశిక్షణ కలిగిన సిబ్బంది అని, ఆయన మరణం ఆసుపత్రికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టకాలంలో వారి కుటుంబానికి ఆసుపత్రి యాజమాన్యం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రమేష్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రికి చెందిన పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొని కన్నీటి నివాళులర్పించారు.

## గ్రామ పరిశుభ్రతకు సహకరించండి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** గ్రామ పరిశుభ్రత విషయంలో పర్వతగిరి గ్రామ పంచాయతీ కఠిన వైఖరి అవలంబిస్తోంది. గ్రామంలో ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు పడేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ చీదురు శంకర్ హెచ్చరించారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా పొలుకమ్మ చెరువు పరిసరాల్లో చెత్త, వ్యర్థ పదార్థాలు పడేస్తే రూ.10,000 జరిమానా విధిస్తామని సర్పంచ్ స్పష్టం చేశారు. అలాగే, ఇలా నిబంధనలు ఉల్లంఘించే వారి గురించి సమాచారం అందించిన లేదా పట్టిచ్చిన వారికి రూ.1,000 నగదు బహుమతి అందజేయనున్నట్లు ప్రకటించారు.రోడ్లు, కాల్వలు, ఖాళీ స్థలాల్లో చెత్త వేయడం వల్ల మురికి పేరుకుపోయి విష జ్వరాలు, ఇతర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కేవలం జరిమానాతో సరిపెట్టకుండా చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను నిర్ణీత స్థలాల్లో లేదా చెత్త సేకరణ వాహనాల్లోనే వేయాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు ప్రతి కుటుంబం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి యువతకు ఈశ్వర్ ఆదర్శం





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మారుముల గ్రామం నుంచి నాసా వైట్ పేపర్ ప్రెజెంటేషన్ వరకు పోయిన ఈశ్వర్ నేటి యువతకు ఆదర్శం. ఆయన ఒక చదువులనే కాదు ఆటలోనూ ఫస్ట్ పాటల్లోను ఫస్ట్. మాథ్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులను గెలుచుకున్న ఈశ్వర్ నేడు అతని పుట్టిన రోజు శుభాకాంక్షలు అయినవోలు గ్రామవాసులు తెలుపుతున్నారు. జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న ఒక పల్లెటూరు నుంచి ఐఐటి లాంటి ఉన్నత చదువులు చదివి నేడు ఆ గ్రామానికి మాత్రమే కాకుండా నేటి యువతకు ఒక ఆదర్శప్రాయంగా నిలవడం గర్వకారణమని ఈశ్వర్ తల్లిదండ్రులు అంటున్నారు. తన పేరుతో ఒక బ్యాండ్ ఏర్పాటు చేసి ఆ బ్యాండ్ హెడ్ గా ఉండడం ఆయన పట్టుదలకు నిదర్శనం. బాస్కెట్ బాల్, పుట్ బాల్ లాంటి అథ్లెటిక్స్ లో ప్రావీణ్యం ఉండడమే కాకుండా రాష్ట్ర జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు గెలుచుకున్నాడు. ఈశ్వర్ 2004 ఫిబ్రవరి 15న మహాశివరాత్రి పండుగ దినాన ఆయన పుట్టడం 22 సంవత్సరాల తర్వాత అదే రోజు మహాశివరాత్రి కావడం తల్లిదండ్రులు ఇది ఒక యాదృచ్ఛికంగా దేవుడి కృపగా భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈశ్వర్ మరెన్నో ఉన్నతమైన పదవులు అవార్డులు అందుకొని పుట్టిన గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తెస్తారని ఈశ్వర్ తల్లి భాగ్యలక్ష్మి తండ్రి గోపాల్ ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## పరీక్షల భయం వీడాలి.. ఆత్మవిశ్వాసంతో సాగాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ/వడ్డేపల్లి :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షలంటే భయం వీడి, ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్, రిటైర్డ్ ఎంఈఓ భిక్షపతి పిలుపునిచ్చారు. వడ్డేపల్లిలోని సాయి సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథ పిల్లల కోసం నిర్వహిస్తున్న సాయి స్పందన హైస్కూల్‌లో శనివారం పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. విద్యార్థులు మానసికంగా ధైర్యంగా ఉన్నప్పుడే పరీక్షలను సులభంగా ఎదుర్కోగలరని తెలిపారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా, ఏకాగ్రతతో ఎలా చదవాలి, జవాబులను ఎలా ప్రెజెంట్ చేయాలి అనే అంశాలపై విద్యార్థులకు మెలకువలు నేర్పారు. ఈ చిట్కాలను పాటించడం ద్వారా ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఆయన భరోసా ఇచ్చారు. పరీక్షల ముందు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు భిక్షపతి చేసిన సూచనలు ఎంతో ఉపయోగపడతాయని స్కూల్ కరెస్పాండెంట్ మాదారు శ్రీనివాసరావు, కార్యదర్శి లింగమూర్తి తెలిపారు. విద్యార్థుల కోసం సమయాన్ని వెచ్చించి వారికి దిశానిర్దేశం చేసినందుకు భిక్షపతికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

# శివ కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానం



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల అద్భుత కళాక్షేత్రం, చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్ళు)లో ఈ నెల 15న నిర్వహించనున్న శివ కళ్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకలకు సంబంధించి శనివారం కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ సభ్యులు మండలంలోని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులకు సాదరంగా ఆహ్వాన పత్రికలను అందజేశారు. ముందుగా మండల కేంద్రంలోని గ్రామదేవత పోచమ్మ తల్లి ఆలయం, శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయం, దక్షిణముఖ ఆంజనేయ స్వామి, సాయిబాబా దేవాలయాల్లో వేద పండితులు గోవర్ధన దుర్వాస ఆచార్యులు, వేణుగోపాలచార్యులు, వినయ్ శర్మలకు ఆహ్వాన పత్రికలు అందజేసి ఆహ్వానించారు. కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు పలువురు ఉన్నతాధికారులను కలిసి కళ్యాణోత్సవానికి రావాల్సిందిగా కోరారు. గణపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్, స్థానిక సీఐ కరుణాకర్ రావు, తహసీల్దార్ మధురకవి సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో లంకపెల్లి భాస్కర్, ఎస్ఐ రేఖ అశోక్, రెండవ ఎస్ఐ గైక్వాడ అమూల్య, పీహెచ్ సీ వైద్యురాలు డాక్టర్ అల్లూరి అనూష, విద్యుత్ శాఖ ఏఈ వెంకటరమణలను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు అధికారులకు వేదాశీర్వచనాలు అందజేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కోటగుళ్లలో జరిగే ఈ మహోత్సవానికి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కమిటీ సభ్యులు కోరారు.

# వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన



**వరంగల్ వాయిస్, రంగసాయిపేట:** ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్యాన్ని అందించడం ప్రాథమిక హక్కు అని, ఆ హక్కును కాపాడటమే వైద్య ఆరోగ్య శాఖ బాధ్యతని జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి ఈదురు అనిల్ కుమార్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు ఆదేశాల మేరకు, శనివారం రంగసాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జక్కులొద్ది, పెరికవాడ అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి 16 ఏళ్ల వయస్సు వరకు సకాలంలో టీకాలు ఇప్పించడం ద్వారా అనేక ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని వివరించారు. ముఖ్యంగా క్షయ, పోలియో, కామెర్లు, ధనుర్వాతం, కోరింత దగ్గు, కంఠసర్పి, మెదడువాపు, న్యుమోనియా, మీజిల్స్, రూబెల్లా తీవ్రమైన నీళ్ల విరోచనాల నివారణకు టీకాలు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లల్లో సాధారణంగా వచ్చే నీళ్ల విరోచనాలు, వాంతులు, జ్వరం, నిమోనియా వంటి వ్యాధుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కలుషితం కాని ఆహారం మరియు నీటిని తీసుకోవాలని కోరారు. ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. మహిళల ఆరోగ్యం కోసం ప్రతి మంగళవారం రంగసాయిపేటలో 'ఆరోగ్య మహిళ' క్లినిక్ నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మహిళలు తమ ఆరోగ్య స్థితిపై అవగాహన పెంచుకోవాలని, రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఇక్కడ ఉచితంగా పరీక్షలు, చికిత్సలు అందుబాటులో ఉంటాయని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జయమణి, విజయ, అంగన్వాడీ కార్యకర్త స్వరూప, ఆశా కార్యకర్తలు జయ, లక్ష్మి, అంగన్వాడీ ఆయా రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ శాఖల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.జాంగిర్ అలీ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ సుబేదారిలోని సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎండీ.సాబీర్ అధ్యక్షతన నిర్వహించిన కీలక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాంగిర్ అలీ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి సేవలు అందించి రిటైర్ అయిన వారికి ఆర్థిక ప్రయోజనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటితో పాటు మరికొన్ని కీలక డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న డ్రైవర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. కొత్త పీఆర్సీని వెంటనే ప్రకటించి, అమలు చేయాలని కోరారు. సిబ్బంది కొరత వల్ల ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై పనిభారం పెరుగుతోందని పేర్కొన్నారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర, జిల్లా నాయకులు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డ్రైవర్లందరూ ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్లు జి.వెంకటేశ్వర్లు, ఎండీ.రఫీక్, నాయకులు పెసరు సుదర్శన్, భాస్కర్, కోశాధికారి ఊదరి కృష్ణమూర్తి, పెద్ద సంఖ్యలో ప్రభుత్వ డ్రైవర్లు పాల్గొన్నారు.

## క్యాతంపల్లిలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



**వరంగల్ వాయిస్,ధర్మసాగర్ :** మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో యూనివర్సిటీ మహిళా కళాశాల (సుబేదారి) ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏడు రోజుల శీతాకాల ప్రత్యేక శిబిరం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఫిబ్రవరి 14 నుంచి 20 వరకు జరిగే ఈ శిబిరానికి కాకతీయ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ శిబిరాలు విద్యార్థులను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దే జీవన పాఠశాలల వంటివని అభివర్ణించారు. కళాశాల ప్రెసిడెంట్ డా.బీఎస్ఎల్.సౌజన్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డా.అనిత రెడ్డి (ఈసీ మెంబర్) మాట్లాడుతూ మహిళా సాధికారత, సేవా తత్వం గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలు యువతలో నాయకత్వ లక్షణాలను, క్రమశిక్షణను పెంపొందిస్తాయని డా.సౌజన్య తెలిపారు. మండల విద్యాధికారి డా.బి. రమదాన్ మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. స్థానిక ఎస్ఐ విద్యార్థులకు చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. శిబిరం ప్రారంభం అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.కె. కవిత, సర్పంచ్ జి.బాలస్వామి, హెడ్‌మాస్టర్ బి.రమేష్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, వలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జనగామ మున్సిపల్ చైర్మన్ పీఠం పద్మశాలీలకే ఇవ్వాలి

◆ పద్మశాలి నాయకుల డిమాండ్



**వరంగల్ వాయిస్, జనగామ :** తెలంగాణ రాష్ట్రంలో 30 లక్షల జనాభా కలిగిన పద్మశాలీలకు రాజకీయంగా తగిన గుర్తింపు లభించాలని, రానున్న రోజుల్లో అన్ని రాజకీయ పార్టీలు నామినేటెడ్ పదవుల్లో పద్మశాలీలకు ప్రాధాన్యత కల్పించాలని పద్మశాలి సంఘం రాష్ట్ర నేతలు డిమాండ్ చేశారు. శనివారం జనగామ పట్టణంలోని కళ్లెం మార్కండేయ భవనంలో పోపా అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన పద్మశాలి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.జనగామ మున్సిపల్ చైర్మన్ పదవి బిసి జనరల్‌కు కేటాయించిన నేపథ్యంలో, 19వ వార్డు కౌన్సిలర్‌గా గెలిచిన పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన దోర్నాల అనిత వెంకటేశ్వర్లుకు చైర్మన్ పదవిని ఇవ్వాలని సంఘం ఏకగ్రీవంగా విజ్ఞప్తి చేసింది. అంకితభావంతో పనిచేస్తున్న పద్మశాలీలకు ఈ అవకాశం కల్పించడం ద్వారా సామాజిక న్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ చందా మల్లయ్య, తెలంగాణ రాష్ట్ర పోపా గౌరవ అధ్యక్షులు డాక్టర్ కూరపాటి రమేష్, వేముల బాలరాజు మాట్లాడుతూ.. పద్మశాలీలు కేవలం ఓటు బ్యాంకుగా మిగిలిపోకూడదని, భవిష్యత్తులో తమ రాజకీయ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భారీ జనాభా ప్రాతిపదికన అన్ని పార్టీలు తమ కులస్తులకు సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనగామ పద్మశాలి సంఘం నాయకులు దోర్నాల వెంకటేశ్వర్లు, ఏల జనార్ధన్, మచ్చ బాల నర్సయ్య, చింతకింది కృష్ణమూర్తి, చింతకింది ఉపేందర్, బండారి ఏకనాథం, వంగ రామస్వామి, రామిని ఆంజనేయులు, కామిని శ్రీనివాస్, కామిని లక్ష్మీనారాయణ, ఏఎల్ఎన్ స్వామి, బత్తిని శ్రీనివాస్, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సీఎం కప్‌కు దేవగిరి మైనార్టీ గురుకుల విద్యార్థినులు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన దేవగిరి పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ములుగు జిల్లా జాకారం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన 'రెండవ ఎడిషన్ ఆఫ్ చీఫ్ మినిస్టర్ కప్ (2025-26)' జిల్లా స్థాయి పోటీల్లో వీరు అద్భుత ప్రదర్శన చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వై.శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన పోటీల్లో వివిధ విభాగాల్లో ఈ కింది విద్యార్థినులు బంగారు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారు. జె.ఆకాంక్ష (అండర్ -16): షార్ట్‌పుట్ విభాగంలో గోల్డ్ మెడల్, ఈ.పూజిత (అండర్-14): రెజ్లింగ్ విభాగంలో గోల్డ్ మెడల్, ఎస్కే.రేష్మ (అండర్-16): రెజ్లింగ్ విభాగంలో గోల్డ్ మెడల్, ఎస్కే.రిజ్వాన, పి.శ్రీవేణి (అండర్-16): వాలీబాల్ విభాగంలో ఎంపిక, పి.శ్రావ్య (అండర్-16) కబడ్డీ విభాగంలో,జి.సన (అండర్-16): 600 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబర్చారు. జిల్లా స్థాయిలో సత్తా చాటిన ఈ క్రీడాకారిణులు, ఈ నెల 20, 21, 23 న జరగనున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలోనూ విజయం సాధించి పాఠశాలకు, జిల్లాకు పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ వై.శ్రీలత, పీఈటీ ఎం.రజిని, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల్లో రాణించడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని వారు పేర్కొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పూజారి రాము మాతృమూర్తి పూజారి మల్లికాంబ ఇటీవల కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం వారి నివాసానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా మల్లికాంబ చిత్రపటానికి పూలమాల వేసి చల్లా ధర్మారెడ్డి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. మల్లికాంబ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడే కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏ కష్టం వచ్చినా పార్టీ శ్రేణులు ఒకే కుటుంబంలా కలిసి నిలబడతామని ఆయన పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యువజన విభాగం నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెండర్ గొడుగుల పంపిణీ




**వరంగల్ వాయిస్, జనగామ :** వైన్స్ క్లబ్ లయన్స్ క్లబ్ జనగామ ఆబాదు ఆధ్వర్యంలో శనివారం రోడ్డుపై వ్యాపారం చేసుకుని చిరు వ్యాపారులకు నీడనిచ్చే ఎందరు గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూర్వ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు మాట్లాడుతూ నూతన శతాబ్ది నినాదం "వేర్ దేర్ ఈస్ ఏ నీడ్ దేర్ ఈస్ ఏ లయన్" నినాదం స్ఫూర్తి తో చిరు వ్యాపారుల అవసరార్థం గొడుగులు వితరణ చేయడం అభినందనీయమన్నారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు పబ్బ చంద్రశేఖర్ సౌజన్యంతో ఈరోజు గొడుగులు వితరణ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు లయన్ కారంపూడి సత్యనారాయణ తెలిపారు. కోశాధికారి ఎస్. ప్రవీణ్ కుమార్, ఎలికట్టె నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కేయూ కంప్యూటర్ సైన్స్ 'బీఓఎస్' చైర్మన్‌గా డాక్టర్ రమేష్



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయ కంప్యూటర్ సైన్స్ విభాగ పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షుడిగా ఆ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.రమేష్ నియమితులయ్యారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు, రమేష్‌ను రెండేళ్ల కాలానికి నియమిస్తూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు డాక్టర్ మంజుల పదవీ కాలం ముగియడంతో ఈ నియామకం జరిగింది. డాక్టర్ రమేష్ నియామకం పట్ల విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బందితో పాటు పరిశోధక విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలియజేశారు.

# మెరిడియన్ స్కూల్ నూతన బ్రాంచ్ ప్రారంభం

**ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని**



**వరంగల్ వాయిస్, దామెర :** మెరిడియన్ స్కూల్ చైర్‌పర్సన్ మాధురి పెసరు ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆరేపల్లిలోని మెరిడియన్ స్కూల్ నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మెరిడియన్ స్కూల్ చైర్‌పర్సన్ మాధురి పెసరుకి శుభాకాంక్షలు తెలియచేస్తూ.. ఉన్నతమైన ప్రమాణాలతో, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతూ, బ్రాంచ్ ద్వారా మరెందరో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెరిడియన్ స్కూల్ ఎండీ కృష్ణ చైతన్య, రామ్ గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ యువ నాయకుడి పుట్టినరోజు వేడుకలు



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు మునిగంటి విష్ణువర్ధన్ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హనుమకొండలోని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నివాసంలో విష్ణువర్ధన్ కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే రేవూరి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి నిండు నూరేళ్లు ఆరోగ్యంగా వర్ధిల్లాలని ఆశీర్వదించారు. తమ నాయకుడి పుట్టినరోజును పురస్కరించుకుని నియోజకవర్గంలోని పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని విష్ణువర్ధన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో, పార్టీ బలోపేతంలో యువత పాత్ర కీలకమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుప్పటి సాంబశివుడు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పసుల అన్నస్వామి, నాయకులు దొమ్మటి బాపురావు, సుధామల్ల కిషోర్, గూడెల్లి కార్తీక్, ఎండీ.సల్మాన్, యువజన విభాగం కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనైతిక రాజకీయాలపై ప్రజా పోరాటం సాగాలి

**◆ తాండ్ర కుమార్ వర్ధంతిలో హంసారెడ్డి పిలుపు**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశాన్ని, రాష్ట్రాన్ని పాలిస్తున్న పార్టీల అనైతిక రాజకీయ విధానాలపై ప్రజలు చైతన్యవంతమై పోరాడాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి ఎన్.రెడ్డి హంసారెడ్డి పిలుపునిచ్చారు. ఎంసీపీఐ (యూ) పొలిట్ బ్యూరో సభ్యులు, తెలంగాణ రాష్ట్ర మాజీ కార్యదర్శి అమరజీవి కామ్రేడ్ తాండ్ర కుమార్ 4వ వర్ధంతి సందర్భంగా శనివారం అంబేద్కర్ సెంటర్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హంసారెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన తప్పుడు విధానాలను కప్పిపుచ్చుకోవడానికి అంతర్జాతీయ శక్తులకు తలొగ్గుతోందని ఆరోపించారు. మనువాద పాలనతో స్త్రీలు, దళితులు, మైనారిటీలను అణచివేస్తున్నారని మండిపడ్డారు. ఈసీ, సీబీఐ, ఈడీ వంటి స్వతంత్ర సంస్థలతో పాటు చివరకు న్యాయవ్యవస్థను కూడా తమ గుప్పిట్లోకి తెచ్చుకునేలా బీజేపీ వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. నైతిక విలువలతో కూడిన రాజకీయాల కోసం కామ్రేడ్ తాండ్ర కుమార్ తుదిశ్వాస వరకు పోరాడారని హంసారెడ్డి గుర్తుచేశారు. ప్రజలకు కూడు, గూడు, విద్య, వైద్యం అందడమే లక్ష్యంగా ఆయన సాగించిన పోరాటాలను ఆదర్శంగా తీసుకుని, కమ్యూనిస్టుల ఐక్యతతో సామాజిక న్యాయం కోసం పనిచేస్తామని స్పష్టం చేశారు. రాజకీయ విలువల రక్షణకు ప్రజల కర్తవ్యం పెరగాలని ఎంసీపిఐ (యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున అన్నారు. ఎన్నికల వేళ పార్టీలు అసంబద్ధ వాగ్దానాలతో రాజకీయాలను కలుషితం చేస్తున్నాయని, పాలకులు దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. తాండ్ర కుమార్ చేసిన భూపోరాటాల వల్ల ఎంతో మంది పేదలకు నీడ దక్కిందని, ఆయన ఆశయ సాధనే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చీపురు ఉదయ్, జిల్లా కమిటీ సభ్యులు మొగిలి శ్రీనివాసరావు, కూతురు ఇంద్రారెడ్డి, మట్టేడ మొగిలి, పరిమళ గోవర్ధన్, రాజు శివకుమార్ పాల్గొన్నారు.

# ప్రశాంతంగా స్రటోవా ఎన్నికలు

**◆ నూతన అధ్యక్షుడిగా పబ్బ వేణు కుమార్**




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ నక్కలగుట్టలోని సాయి రామ్ టవర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (స్రటోవా) ఎన్నికలు శనివారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడు వేముల సదానందం నేత అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా పబ్బ వేణు కుమార్, ప్రధాన కార్యదర్శిగా కలకోట వెంకటేశ్వర్ రావు, కోశాధికారిగా చుంచు ఐసయ్య, ఉపాధ్యక్షులుగా దార్లపాటి సునీత, సహాయ కార్యదర్శిగా బాసాని ఉమాదేవి, కార్యవర్గ సభ్యులుగా దిగువ స్వర్ణలత, గంకిడి రామకృష్ణా రెడ్డి, ముఖ్య సలహాదారులుగా పూర్వ అధ్యక్షులు వేముల సదానందం నేత ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం ప్రస్తుత అధ్యక్షుడు వేముల సదానందం నేత నూతన అధ్యక్షుడు పబ్బ వేణు కుమార్ కు బాధ్యతలు అప్పగించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతుందని ఆయన ప్రకటించారు. గత నాలుగేళ్లుగా అసోసియేషన్ అభివృద్ధికి సహకరించిన సభ్యులందరికీ సదానందం నేత కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ నూతన అధ్యక్షుడు వేణు కుమార్ ధన్యవాదాలు తెలియజేశారు. టవర్స్ నివాసితుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గం పేర్కొంది.

# ప్రేరణతో ప్రోత్సాహం

**• కలెక్టర్ రిజ్వాన్ బాషా**



**వరంగల్ వాయిస్, జనగామ/దేవరుప్పుల :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో జనగామ జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు విద్యార్థులు పట్టుదలతో చదవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. శనివారం దేవరుప్పుల మండలంలోని 11 పాఠశాలలకు చెందిన విద్యార్థుల కోసం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ప్రేరణ' అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు 'విజయోస్తు' మెటీరియల్‌ను క్షుణ్ణంగా చదవాలని, గత ఐదేళ్ల ప్రశ్నపత్రాలను సాధన చేయాలని సూచించారు. జటిలమైన సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, కేవలం చదవడమే కాకుండా రాసే అలవాటు చేసుకోవాలని తెలిపారు. పరీక్షల సమయంలో భయం వదిలేయాలని, పౌష్టికాహారం తీసుకుంటూ కనీస నిద్ర ఉండేలా చూసుకోవాలని హితవు పలికారు. గత ఏడాది జిల్లాలో టాపర్లుగా నిలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని, దేవరుప్పుల మండలం ఈసారి అత్యుత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి, వారి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ కళావతి, మోటివేషన్ స్పీకర్ డా. బ్రహ్మ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు

జనగామ, స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీల చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలను ఈ నెల 16న అత్యంత పారదర్శకంగా, చట్టబద్ధంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అధికారులతో గూగుల్ మీటింగ్ ద్వారా ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల నిబంధనలు ఈ నెల 16న ఉదయం 11:00 గంటలకు సభ్యుల ప్రమాణ స్వీకారం, మధ్యాహ్నం 12:30 గంటలకు చైర్‌పర్సన్, అనంతరం వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక జరుగుతుంది. మొత్తం సభ్యులలో కనీసం 50 శాతం మంది హాజరైతేనే సమావేశం చెల్లుబాటు అవుతుంది. రాజకీయ పార్టీల సభ్యులు తమ పార్టీ విప్‌ను తప్పనిసరిగా పాటించాలి. విప్ ఉల్లంఘిస్తే పదవి కోల్పోతారని, అయితే వారు వేసిన ఓటు మాత్రం చెల్లుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. గుర్తింపు పొందిన పార్టీలు ఫారమ్–ఏని 15వ తేదీ ఉదయం 11:00 లోపు, ఫారమ్–బీని 16వ తేదీ ఉదయం 10:00 గంటలలోపు సమర్పించాలి. ఎన్నికల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రోషన్ హీరోగా ఏమో ఏమో ఇది మూవీ






ఛాంపియన్ హీరో రోషన్ మేక టాలెంటెడ్ డైరెక్టర్ శైలేష్ కొలను కాంబినేషన్‌లో రూపొందుతున్న సరికొత్త చిత్రానికి 'ఏమో ఏమో ఇది' అనే క్లాసిక్ టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. వాలెంటైన్స్ డే సందర్భంగా శనివారం ఈ సినిమా టైటిల్‌తో పాటు 'ద ఫస్ట్ బ్రీజ' పేరుతో ఒక చిన్న గ్లింప్స్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఇప్పటివరకు 'హిట్' సిరీస్, 'సైంధవ' వంటి ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్లతో మెప్పించిన శైలేష్ కొలను, ఈసారి పూర్తి భిన్నంగా రొమాంటిక్ కామెడీ జానర్‌ను ఎంచుకోవడం విశేషం. ఈ గ్లింప్స్‌లో హీరో రోషన్ (అభయ్) తన తల్లితో అమ్మాయిల గురించి, నేటి తరం రిలేషన్ షిప్స్ గురించి చేసే కామెడీ సంభాషణలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో రోషన్ సరసన 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ (అపూర్వ పాత్రలో) కథానాయికగా నటిస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఖుషి', 'హాయ్ నాన్న' వంటి చిత్రాలకు అద్భుతమైన మ్యూజిక్ అందించిన హేషామ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2026 దసరా కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

# సినిమా షూటింగ్ డిలేపై బన్నీ అసహనం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ కుమార్ తో చేస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా గురించి ఇండస్ట్రీలో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. దాదాపు రూ.800 కోట్ల భారీ బడ్జెతో హాలీవుడ్ రేంజ్‌లో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విజువల్ వండర్‌గా, హైఎండ్ గ్రాఫిక్స్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. అందుకే ఈ సినిమాకు సంబంధించిన చిన్న న్యూస్ అయినా సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అవుతోంది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, ఈ సినిమా విడుదల తర్వాత ఇండియన్ సినిమా మేకింగ్ స్టైల్‌లో కొత్త ట్రెండ్ సెట్ అవుతుందని భావిస్తున్నారు. లార్జ్ స్కేల్ ప్రాజెక్ట్స్‌కు ఈ సినిమా ఫౌండేషన్‌గా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతుందనే వార్తలు వినిపిస్తున్నప్పటికీ, తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై మరో టాక్ ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. అదేంటంటే? సినిమా షూటింగ్ అనుకున్న దానికంటే నెమ్మదిగా సాగుతుండటంతో అల్లు అర్జున్ అసంతృప్తిగా ఉన్నాడని గాసిప్స్ వినిపిస్తున్నాయి. ప్లాన్ చేసిన రిలీజ్ డేట్‌కు సినిమా పూర్తి అవుతుందా లేదా అన్న ఆందోళన కూడా బన్నీకి ఉన్నట్లు టాక్. ఈ నేపథ్యంలో మేకర్స్‌తో మాట్లాడి, మేకింగ్‌ను మరింత పక్కాగా ప్లాన్ చేసి షూటింగ్ వేగవంతం చేయాలని సూచించినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ న్యూస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మొత్తంగా చూస్తే, అట్లీ ` అల్లు అర్జున్ కాంబినేషన్ మూవీ 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ రెండు ప్రాజెక్ట్స్ పూర్తయ్యే సరికి అల్లు అర్జున్ రేంజ్ గ్లోబల్ లెవల్‌కు వెళ్లే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఫ్యాన్స్ మాత్రం ఈ భారీ సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





# ఘట్టమనేని మరో వారసుడు జయకృష్ణ ఎంట్రీ

శ్రీనివాస మంగాపురం మూవీ పోస్టర్ విడుదల

వాలంటైన్స్ డే సందర్భంగా తెలుగు సినీ ప్రియులకు ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ పోస్టర్‌ను చిత్ర బృందం నేడు విడుదల చేసింది. విడుదలైన పోస్టర్‌లో 'ఏ భాషలో చెప్పాలి నా ప్రేమని, వెయ్యేళ్ళ నా ఈ ఎడబాటుని' అంటూ కథానాయకుడు శ్రీను మంగతో చెప్పిన డైలాగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతుండడంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతుంది. ఇక ఈ సినిమాకు ఆర్ ఎక్స్ 100, మంగళవారం చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నాడు. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా మరియు ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్ వంటి ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.





# లోకేశ్ కనగరాజ్ హీరోగా డీసీ

'ఖైదీ', 'విక్రమ', 'కూలీ' వంటి విజయవంతమైన చిత్రాలతో దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లోకేశ్ కనగరాజ్ ఇప్పుడు నటుడిగా మారబోతున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డీసీ' . ఈ సినిమాకు అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా.. సన్ పిక్చర్స్ నిర్మిస్తుంది. లోకేశ్ కనగరాజ్ సరసన వామికా గబ్బీ కథానాయికగా నటిస్తుంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను వాలంటైన్స్ కానుకగా విడుదల చేసింది చిత్రయూనిట్. గ్లింప్స్ లో లోకేష్ కనగరాజ్ ఇంటెన్స్ అండ్ రా లుక్ లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. లోకేష్ ఇందులో దేవదాస్ పాత్రలో కనిపించబోతున్నాడు.



# చైర్ పర్సన్ పై 'కోటి' ఆశలు

- సీటు కోసం బిజీ బిజీ
- హైదరాబాద్ లో జరుగుతున్న ఫైనల్ ఫైట్

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఫలితాలు వెల్లడి కావడంతో ఈ నెల 16న జరిగే చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికపైనే అధికార కాంగ్రెస్ దృష్టి పెట్టింది. ఆ పార్టీ నుంచి గెలుపొందిన అభ్యర్థులను క్యాంపులకు తరలించారు. కాంగ్రెస్ కు సొంత మెజార్టీతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కావాల్సినంత బలం ఉన్నప్పటికీ పార్టీలోనే చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉండడంతో క్యాంపు రాజకీయాలకు శ్రీకారం చుట్టారు.

## ఎస్సీ జనరల్ కు రిజర్వ్..

మున్సిపాలిటీ ఎస్సీ జనరల్ కు రిజర్వ్ కాగా చైర్పర్సన్ పదవి దక్కించుకునేందుకు ప్రధానంగా ముగ్గురు కౌన్సిలర్లు పోటీపడుతున్నారు. ఓట్ల లెక్కింపు ముగియగానే డోర్నకల్ మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మొత్తం 15 వార్డులలో కాంగ్రెస్ 11 కౌన్సిలర్ గెల్చుకోవడంతో అందరి దృష్టి చైర్ పర్సన్ పీఠంపై పడింది. ఇప్పటి వరకు ఎన్నికల బరిలో గెలుపొందిన కౌన్సిలర్లు ప్రస్తుతం చైర్ పర్సన్ పీఠంపై దృష్టి సారించారు. అధిష్టానం తమకు అవకాశం ఇస్తుందని ఎవరికి వారు తమ ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందోనని పార్టీ కార్యకర్తలు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

## నేతలు బిజీ బిజీ..

డోర్నకల్ మున్సిపాలిటీలో గెలుపొందిన వారిలో ప్రధానంగా 6వ వార్డు నుంచి కొండేటి రాజకుమారి, 13వ వార్డు నుంచి ఎన్నికైన సువర్ణ, 15వ వార్డు నుంచి గెలుపొందిన గ్యారా రమేష్ చైర్ పర్సన్ రేసులో ఉన్నారు. చైర్ పర్సన్ కుర్చీ కోసం ఎన్నికైన కౌన్సిలర్లు ఎవరికి వారు తమ ప్రయత్నాలలో బిజీగా ఉన్నారు. కొండేటి రాజకుమారి గతంలో ఎంపీటీసీగా పనిచేసిన అనుభవం ఉంది.

13వ వార్డు నుంచి గెలుపొందిన సువర్ణ ఇప్పటికే చైర్ పర్సన్ పీఠం కోసం తాను పనిచేస్తున్న ఆశావర్కర్ ఉద్యోగానికి రాజీనామా చేసి మరీ రాజకీయాలకు వచ్చింది. 15 వార్డు నుంచి గెలుపొందిన గ్యారా రమేష్ ఇటీవలే తన రైల్వే ఉద్యోగం నుంచి రిటైర్మెంట్ తీసుకున్నారు. ఈ మేరకు ఎవరికి వారే తమ బయోడేటాలను సిద్ధం చేసి అధిష్టానానికి స్థానిక నాయకత్వానికి అందజేశారు. చైర్ పర్సన్ గా తమకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ కు విన్నవించుకున్నారు.

ఎవరి ప్రయత్నాల్లో వారు బీజీగా ఉన్నప్పటికీ చివరిగా స్థానిక ఎమ్మెల్యే నిర్ణయం మేరకే చైర్ పర్సన్ ఫైనల్ కానుంది. ఏకాభిప్రాయం వ్యక్తం కాకపోతే అధిష్టాన పెద్దలు రంగంలోకి దిగే అవకాశం ఉందని పలువురు నాయకులు భావిస్తున్నారు. దీంతో కౌన్సిలర్ అభ్యర్థుల 'కోటి' ఆశలు ఎవ్వరు నేరవేర్చుతారో అనే అసక్తికి సోమవారం తెర పడనుంది.

# అహింసా సందేశంతో స్ట్రే డాగ్ అడాప్షన్

- కేబీఆర్ పార్క్ లో నిర్వహణ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** నగరంలోని కేబీఆర్ పార్క్ లో డాగ్ అడాప్షన్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క హజరయ్యారు. కొండా సురేఖ చేతుల మీదుగా స్వదేశి కుక్కపిల్లను మంత్రి సీతక్క అడాప్ట్ చేసుకుని ఆదర్శనంగా నిలిచారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ యజమానులు చనిపోతే ఆవేదనతో మృతి చెందిన కుక్కలు ఉన్నాయని శునకాలపై అనవసరంగా దాడి చేస్తేనే అవి తిరిగి దాడికి పాల్పడతాయని అన్నారు. తన ఇంటి చుట్టూ నిత్యం పదికి పైగా కుక్కలు సంచరిస్తున్న తాను ఎప్పుడూ వాటిని తొలగించాలని ఫిర్యాదు చేయలేదని అన్నారు. కేవలం స్టెరిలైజ్ చేసి వదిలేయాలని సూచించినట్లు తెలిపారు. ఎంతో విశ్వాసంతో మెలిగే శునకం యజమానికి రక్షణగా నిలుస్తుందని అన్నారు. ఇంట్లో కుక్క ఉంటే మనిషితో సమానమని అన్నారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ కుక్క పిల్లలను దత్తత తీసుకొని ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రేణుకా చౌదరి ,మంత్రి సీతక్క,ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, మాజీ కార్పొరేటర్ విజయా రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.




# వామపక్ష పార్టీలకు ధన్యవాదాలు

- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్
- సమ్మె విజయవంతంపై హర్షం




**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** ఆల్ ట్రేడ్ యూనియన్స్, వామపక్ష పార్టీలు, బీఆర్ టీయూ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న జరిగిన సమ్మె విజయవంతం కావడంపై మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అధ్యక్షతన వరంగల్ శివనగర్ సీపీఐ కార్యాలయంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్టీయూ మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ తోపాటు సీఐటీయూ జిల్లా ఆరూరి కుమార్, ఏఐసీటీయూ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్, ఏఐసీసీటీయూ అక్కనపల్లి యాదగిరి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పనస ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య, ఎంసీపీఐయూ నగర కార్యదర్శి మాలోత్ సాగర్, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి రాచర్ల బాలరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేసినందుకు వరంగల్ జిల్లా కార్మిక వర్గానికి రైతాంగానికి ప్రజలకు వారు ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ పోరాటం ఇంతటితో ఆగిపోదని, బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లును రద్దుచేసి 29 కార్మిక చట్టాలను కొనసాగించేంతవరకు వరంగల్ జిల్లాలో ఉమ్మడిగా కలిసి పోరాటం ఉధృతం చేస్తామని, అందుకు తదుపరి కార్యాచరణను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చెన్నకేశవులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎండి బషీర్, ఏసీటీయూ జిల్లా అధ్యక్షులు సుంచు జగదీశ్వర్, బీఆర్ టీయూ జిల్లా నాయకులు దుబ్బ శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా సహకార దర్శి సంఘీ, ఏలేందర్, యాకూబ్, బీఆర్ టీ నాయకులు మోదం ప్రవీణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com